## రోడ్డు విస్తరణ ఎంత? : కార్పొరేటర్


జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఎల్‌బీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్-ఎల్బీనగర్ వరకు ఉన్న సీఎం రోడ్డు విస్తరణ పనులు ఎన్ని అడుగులకు చేపట్టనున్నారని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ప్రశ్నించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఆమె కలిశారు. సీఎం రోడ్డు విస్తరణ 50 అడుగులా లేక 60 అడుగులా లేక 100 అడుగులు చేస్తారా అనే విషయంపై స్పష్టత కావాలని ఆమె కోరారు. సరూర్‌నగర్ చౌడి సుందరీకరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పాత భవనం ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందా అన్న భయం స్థానికుల్లో నెలకొందన్నారు. తక్షణమే భవనాన్ని తొలగించి చౌరస్తా సుందరీకరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

## స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి


సీఎం ఓఎస్‌డీని కలిసి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగ సంఘాల నాయకులు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ ఆధ్వర్యంలో సచివాలయంలో సీఎం ఓఎస్‌డీని వేముల శ్రీనివాస్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే అమలు చేస్తున్న రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు రాష్ట్రాల నిబంధనలు, చట్టాల అమలు, విధి విధానాలను ఓఎస్‌డీకి కమిటీ బృందం వివరించారు. తక్షణమే స్పందించిన ఓఎస్‌డీ అన్ని విషయాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. ఈ అంశంపై పూర్తిస్థాయి నివేధిక సమర్పించాల్సిందిగా వికలాంగుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి అనితారాంచంద్రన్ కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎండీ షఫిఅహ్మద్‌ఖాన్, తుడుం రాజేందర్, ధైనంపల్లి మల్లికార్జున్, బెస్త యాదగిరి, శబరి చావ్లా, విజయసింహారెడ్డి ఉన్నారు.

## అవసరమైన ప్రతీ చోటా రోడ్ల నిర్మాణం


ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ఎక్కడెక్కడైతే బీటీ, సీసీ రోడ్లు అవసరమో అక్కడక్కడ రోడ్లను దశలవారీగా వేయిస్తున్నామని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్‌లో శుక్రవారం చేపట్టిన రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా గుంతలు పడిన సీసీ రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్‌శాఖ డీఈ కనకయ్య, ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, కాలనీవాసులు మురళిగౌడ్, జగన్, సతీష్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కోర్టులో ఉచిత నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 11(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్‌అసోసియేషన్, వాసన్ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, ఇతర అధికారులకు నేత్ర పరీక్షలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాసెట్టి కార్తీక్, మహిళా ప్రతినిధి అనసూయ, డాక్టర్ శశిధరప్రసాద్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): వందరోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ, ఆటోనగర్‌లోని లెజెండ్, పెద్దఅంబర్‌పేట్‌లోని విజయ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది అందరికి ఉచితంగా బీపీ, షుగర్, రక్త, సాధారణ పరీక్షలతో పాటు మహిళల కోసం గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ వైద్యులతో వైద్య పరీక్షలు చేయించామన్నారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ అధికారి లక్ష్మీప్రసన్న, కల్పన, సువర్ణ, హరీష్, వైద్యులు శ్యాం, శివ, మేనేజర్ కిరణ్‌కుమార్, డీఈఈ జ్యోతి, శ్రీనివాస్, దశరథ, సూపర్‌వైజర్లు చంద్రశేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

## ఫిజిక్స్ విభాగంలో సత్యనారాయణకు డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న సత్యనారాయణ

వనస్థలిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ తోడేటి ఫిజిక్స్ విభాగంలో చేపట్టిన పరిశోధనకు గాను శుక్రవారం డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్.షరీఫుద్దీన్ ఆధ్వర్యంలో ఫిజికల్ అండ్ స్పెక్ట్రోస్కోపిక్ స్టడీస్ ఆఫ్ టెల్లూరియమ్ ఆల్కాలి టెట్రా బోరేట్ కంటేయినింగ్ ట్రాన్సిషన్ మెటల్ అయాన్ అనే అంశంపై పరిశోధన పూర్తిచేసిన సందర్భంగా తనకు డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ డాక్టరేట్ భవిష్యత్‌లో మరిన్ని పరిశోధనలు చేయడానికి తనకు మరెంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ మేరకు కాలనీవాసులు సత్యనారాయణను అభినందించారు.

## ఆలయాల వద్ద యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి

సైదాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో బోనాల ఉత్సవాలు నిర్వహించే ఆలయాల వద్ద జీహెచ్‌ఎంసీ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను బీఆర్‌ఎస్ యాఖత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సింగరేణికాలనీ ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులకు దేవాదాయశాఖ చెక్కును ఆయన అందజేశారు. ఈనెల 20న బోనాలు నిర్వహించే ఆలయాల వద్ద, రోడ్ల మరమ్మతులు, రంగులు వేయడం, వీధి దీపాలు అమర్చడం వంటి కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, విక్రం, నగేష్, దర్గయ్య, సాయి, మహేష్, పద్మారావు పాల్గొన్నారు.

## పంపిణీకి సిద్ధంగా చెత్త సేకరణ రిక్షాలు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట జీహెచ్‌ఎంసీ సర్కిల్‌కి 60 చెత్త సేకరణ త్రీవీలర్ రిక్షాలను కేటాయించారు. అవి ఇటీవలె వచ్చాయి. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో వీటిని ఉంచారు. వీధుల్లో, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే శానిటేషన్ సిబ్బందికి ఈ రిక్షాలను అందించనున్నట్లు మలక్‌పేట సర్కిల్6 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ రుద్ర శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ బలాల చేతుల మీదుగా ఆయా డివిజన్ల సిబ్బందికి అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వనస్థలిపురం: ఇంజాపూర్ కమాన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వనస్థలిపురం ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజాపూర్ కమాన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మృతుడి వయసు సుమారు 28 నుంచి 32 సంవత్సరాలు ఉంటుందని, తెలుపు ఛాయ, 5.7 అడుగుల ఎత్తు బ్లూ కలర్ చెక్స్ షర్ట్, బ్లూ జీన్స్ వేసుకొని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని, అతడి తరఫు సంబంధీకులు ఉంటే వెంటనే వనస్థలిపురం పోలీసులను సంప్రదించాలని కోరారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణంపై

# తొలగని ప్రతిష్టంభన!

- ఆలయం మీదుగా నిర్మాణం చేపట్టవద్దంటూ అభ్యంతరాలు
- అధికారులు, ఆలయ ప్రతినిధుల మధ్య రాజీ ఒప్పందానికి బ్రేక్
- ఐదేళ్లు గడిచినా కొలిక్కి రాని పనులు


సైదాబాద్ చౌరస్తాలో ముందుకు సాగని నిర్మాణం

సైదాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అధికారుల తీరుతో సైదాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులపై తిరిగి ప్రతిష్టంభన నెలకొంది. స్టీల్‌బ్రిడ్జి ముందస్తు అలైన్‌మెంట్ ప్రతిపాదనను అధికారులు కొందరికి అనుకూలంగా మార్పు చేశారన్న ఆరోపణలు మరోసారి వివాదానికి తెరలేపాయి. అలైన్‌మెంట్ మార్పు వల్ల సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టవద్దంటూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో గతంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు పెద్దఎత్తున నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు ఆలయ కమిటీ ప్రతినిధులతో అధికారులు సమావేశమై రాజీ ఒప్పందం చేశారు. ఆలయాన్ని ప్రత్యామ్నాయంగా వెనుక భాగం ఉన్న 250 గజాలకు పైగా స్థలం మంజూరు చేసే విధంగా అంగీకారానికి వచ్చారు. ఈ ప్రతిపాదనకు ఆలయ కమిటీ, నేతలు అంగీకరించడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి.

### రెవెన్యూ రికార్డుల్లో జైళ్లశాఖ స్థలం

స్టీల్ బ్రిడ్జి ఆలయం మీదుగా వెళ్తున్న కారణంగా పక్కనే ఉన్న సుమారు 250 గజాల స్థలాన్ని ప్రత్యామ్నాయంగా ఇచ్చేవిధంగా కమిటీ ప్రతినిధులు రాజీ కుదుర్చుకున్నారు. ఆలయానికి ఇద్దామన్న స్థలంలో ఉంటున్న ప్రైవేటు వ్యక్తులకు ప్రాజెక్టు భూసేకరణ కింద వచ్చే నష్టపరిహారం నిధులు కేటాయిద్దామని అధికారులు నిర్ణయించారు. కానీ ఆ స్థలం రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ రికార్డుల్లో జైళ్లశాఖ స్థలంగా ఉండడంతో వివాదం మొదటికి వచ్చింది. నిబంధనల ప్రకారం నష్టపరిహారం జైళ్లశాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. తమకు ప్రత్యామ్నాయ స్థలం ఇచ్చేవరకు ఆలయం వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకుంటామని బీజేపీ, ఆలయ కమిటీలు హెచ్చరిస్తున్నాయి. దీంతో ఆలయ ప్రాంతంలో పనులు తాత్కాలికంగా వాయిదా వేశారు. ఇంత జరుగుతున్నా జైళ్లశాఖ అధికారులు మాత్రం తమ శాఖ స్థలానికి నష్టపరిహారం వస్తుందని సమాచారం ఉన్నా ప్రేక్షకపాత్ర వహించడం గమనార్హం. దీంతో జైళ్లశాఖ అధికారులు మౌనంగా ఉండడంతో ప్రాజెక్టు అధికారులు రికార్డులు మార్చి ప్రైవేటు వ్యక్తులకు నష్టపరిహారం ఇచ్చేవిధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.


ఆలయం ముందు నిలిచిన పనులు

### అలైన్‌మెంట్ మార్పుతోనే వివాదం..

మొదట రూపొందించిన ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను కొందరు ప్రజాప్రతినిధులకు మేలు చేసే విధంగా మార్చారంటూ ప్రచారం జరగడంతో వివాదానికి తెరదీసింది. స్టీల్ బ్రిడ్జి పనులకు జూలై 2020లో అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. 24నెలల్లో స్టీల్ బ్రిడ్జి వాహనదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని కేటీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ ఐదేళ్లు గడిచినా పనులు అసంపూర్తిగానే కొనసాగుతున్నాయి. చంచల్‌గూడ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వరకు వైపు నాలుగు లైన్ల స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం స్ట్రాటజికల్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్‌ఆర్‌డీపీ) కింద రూ.523.37కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబడుతుంది. ఇందులో రూ.370 కోట్ల నిర్మాణ వ్యయం, రూ.153.37 భూసేకరణ కోసం కేటాయించారు. అయితే స్టీల్ ధరలు పెరిగిన నేపథ్యంలో అంచనా వ్యయాన్ని రూ.620కోట్లకు పెంచుతూ ఆరు నెలల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 3.38కిమీల మేర నాలుగు లైన్లతో స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. 88 పిల్లర్లపై బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. రీన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రిట్(ఆర్‌సీసీ) డెక్ స్లాబ్‌తో స్టీల్ పియర్లు, స్టీల్‌పైర్‌క్యాప్, స్టీల్‌గిడ్డర్లతో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే నల్గొండ ఎక్స్‌రోడ్డు నుంచి ఓవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండడంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుంది. ముఖ్యంగా చంపాపేట చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వారితో పాటు శంషాబాద్ విమానాశ్రయం, కేంద్ర రక్షణ రంగ సంస్థలకు, శ్రీశైలం, నాగార్జునసాగర్ వెళ్లే వైపు ప్రయాణం సులువవుతుంది. చంచల్‌గూడ, సైదాబాద్, ధోబీఘాట్, ఐఎస్‌సదన్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. అంతే గాకుండా ఐఎస్‌సదన్ నాలుగు కూడలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు మోక్షం కలుగనుంది.


చంచల్‌గూడ చౌరస్తాలో చకచక సాగుతున్న నిర్మాణ పనులు

### ప్రాజెక్టు అధికారుల తీరుతోనే వివాదం



అధికారులు కొందరికి ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్చడంతోనే వివాదానికి దారితీసింది. మొదట స్టీల్ బ్రిడ్జి నిర్మాణం ఆలయం పై నుంచి కాకుండా సమీపం నుంచి వెళ్లే విధంగా ప్లాన్ వేశారు. ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో ప్లాన్ మార్చి దేవాలయం మీదుగా వెళ్లే విధంగా నిర్మాణం చేపడుతున్నారు. భక్తుల మనోభావాలను గౌరవించి అలైన్‌మెంట్ మార్చాలి. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుంది. **- నిరంజన్‌యాదవ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు**

### అధికారులపై చర్యలు తీసుకోవాలి



దేవాలయానికి ఇబ్బందులు కలుగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని అధికారులు ఒప్పించి పనులు మొదలుపెట్టారు. కానీ ఇంజనీరింగ్ అధికారులు మాటమారుస్తూ ఆలయం మీదుగా బ్రిడ్జి నిర్మాణం సాగుతుందని చెబుతుండడం దారుణం. హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. **- సహదేవ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్, కుర్మగూడ**

### ఉద్దేశపూర్వకంగా అలైన్‌మెంట్ మార్చారు



దేవాలయం ఎదురుగా ఉన్న తొమ్మిది అంతస్తుల ప్రైవేటు భవనాన్ని సంరక్షించేందుకే బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను ఉద్దేశపూర్వకంగా మార్చారు. ప్రాజెక్టు అధికారుల చర్యలతోనే వివాదానికి దారితీసింది. మొదటి అలైన్‌మెంట్ మార్పుపై విజిలెన్స్ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆలయానికి ఇబ్బందులు రాకుండా నిర్మాణ పనులు చేపట్టాలి. లేకుంటే న్యాయ పోరాటం చేస్తాం. **- వీరేందర్‌యాదవ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి**

## గోరింటాకు సంబరాల్లో సబిత

- క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహణ
- గోరింటాకు దంచిన ఎమ్మెల్యే


గోరింటాకు పెట్టుకున్న మహిళలతో సబితమ్మ

సరూర్‌నగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నిత్యం రాజకీయాలతో బిజీగా ఉండే మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి శుక్రవారం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ మహిళా నేతలతో సరదాగా గడిపారు. ఆషాఢ మాసం సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం మీర్‌పేట్ అధ్యక్షురాలు సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన గోరింటాకు సంబరాలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మునిసిపాలిటీలు, మహేశ్వరం, కందుకూరు మండలాలు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లకు చెందిన మహిళా నేతలు, మాజీ కార్పొరేటర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే సబిత వారందరితో కలిసి స్వయంగా గోరింటాకు దంచారు. అనంతరం వారి చేతులకు గోరింటాకు పెట్టారు.

### గోరింటాకు వేడుక మహిళల్లో ఐక్యతకు దోహదం

గోరింటాకు వేడుక మహిళల్లో ఐక్యతకు దోహదపడుతుందని సబితారెడ్డి అన్నారు. మహిళలంతా ఒక్కచోట చేరి ఉత్సాహంగా గడపడంతో వారి మధ్య స్నేహ బంధం మరింత దృఢమవుతుందని ఆమె పేర్కొన్నారు.

## కర్మన్‌ఘాట్ ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఈఓ లావణ్య

చంపాపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో 112 రోజులు భక్తులు హుండీలో వేసిన కానుకలను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో లెక్కింపు చేపట్టారు. కార్యనిర్వహణాధికారి లావణ్య, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రేంకుమార్, ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కింపు చేయగా రూ.55.14.153లు పైగా ఆదాయం వచ్చింది. ఈ హుండీ లెక్కింపులో కెనడా డాలర్లు10, కువైట్ దినార్, యూఎస్ డాలర్లు43, శ్రీలంక రూపాయలు 200, కత్తార్ రియాల్స్11, యుకే పౌండ్స్ 5, యూఏఈ దిర్హామ్స్10 లభించాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దిండు ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, జనుంపల్లి విషువర్ధన్‌రెడ్డి, నారాయణ్ దుర్గారెడ్డి, కె.కవిత, ఓరుగంటి నరేష్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఎనుముల రవీందర్‌రెడ్డి, రాజేశ్వరి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శోభాయమానంగా బాబా పల్లకి సేవ


బాబా పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్‌లో గురుపౌర్ణమి ఉత్సవాలు శుక్రవారం పల్లకిసేవతో ముగిసినవి. ప్రత్యేక అలంకరణల నడుమ స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన సాయిబాబా దర్శనంతో భక్తులు.. భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. 24 గంటల పాటు సాగిన సాయినామ ఏకాహము శుక్రవారం ఉదయం 9గంటలకు ముగించారు. రాత్రి 7గంటలకు వందలాది సాయి భక్తుల భజనల నడుమ సాయి సంస్థాన్ నుంచి బయల్దేరిన బాబా పల్లకిసేవ శోభాయాత్ర దిల్‌సుఖ్‌నగర్ పురవీధుల్లో కనుల పండువగా సాగింది.

### బీజేపీ అధ్యక్షుడి ప్రత్యేక పూజలు..

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన పల్లకిసేవలో పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల ఆమోదంపై హర్షం

ఎల్‌బీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ ఆర్‌కేపురం నేతలు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆర్‌కేపురంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిల పిలుపు మేరకు ఈ సంబరాలు జరుపుకున్నట్లు యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పార్టీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చైర్మన్ తలాటి రమేష్‌నేత, బీసీ ఉద్యమకారుడు గట్ల రవీంద్ర, లింగస్వామి గౌడ్, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ సురేందర్‌కుమార్, జ్ఞానేశ్వర్‌యాదవ్, యాదవరెడ్డి, పగడాల శ్రీశైలం, సందీప్, శాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి : లెఫ్టినెంట్ కల్నల్



నియామక పత్రం అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ జజేష్‌కుమార్ కేపి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్కూల్ దశలోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లెఫ్టినెంట్ కల్నల్ జజేష్‌కుమార్ కేపి సూచించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెంలోని క్యాండర్ ప్రైన్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రమాణ స్వీకరణ వేడుకకు ఆయన హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కల్నల్ జజేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి దేశరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా స్కూల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులతో క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్, ప్రిన్సిపాల్, అకాడమిక్ డైరెక్టర్ పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు నిధులు మంజూరు

చాదర్‌ఘాట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మూసారాంబాగ్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ నుంచి రూ.25లక్షల నిధులను మంజూరు చేయించినట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల్లో బోనాల ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఈఈ ప్రజ్ఞ, ఏఈ శరత్, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మూసారాంబాగ్ డివిజన్‌లో బోనాల ఉత్సవాలు నిర్వహించే ఆరు అమ్మవారి ఆలయాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.25లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సాయినగర్ పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు బండి అనిల్‌కుమార్, అమిత్‌కుమార్, గడ్డిఅన్నారం అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్, హరి, ప్రశాంత్, ఉమేష్ పాల్గొన్నారు.

## ఉపకమిషనర్ల బదిలీలు, పోస్టింగులు

ఎల్‌బీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పలు సర్కిళ్ల ఉపకమిషనర్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారు బాధ్యతలు స్వీకరించారు. జోనల్ కార్యాలయంలో కొత్తగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఉపకమిషనర్‌ను నియమించారు. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1కు పదోన్నతి పొందిన లైసెన్స్ ఆఫీసర్ బి. గోపాల్‌రావును ఎల్బీనగర్ జోన్‌కు కొత్తగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఉపకమిషనర్‌గా నియమించారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన చందానగర్ ఉప కమిషనర్ పి. మోహన్‌రెడ్డిని చార్మినార్, సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్ల శానిటేషన్-1 జాయింట్ కమిషనర్‌గా నియమించారు. మల్కాజిగిరి ఉపకమిషనర్‌గా పనిచేస్తున్న జి.రాజును ఉప్పల్ సర్కిల్ ఉపకమిషనర్‌గా నియమించారు. ఉప్పల్ ఉప కమిషనర్‌గా పనిచేస్తున్న అంజనేయులును సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్‌గా బదిలీ చేశారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొంది సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న కె. మల్లికార్జున్‌రావును ఎల్బీనగర్ ఉపకమిషనర్‌గా నియమించారు. ఇక్కడ ఉపకమిషనర్‌గా పనిచేస్తున్న సెవా ఇస్లావత్‌ను మూసాపేట్ సర్కిల్ ఉపకమిషనర్‌గా నియమించారు. మూసాపేట్ సర్కిల్ ఉపకమిషనర్‌గా పనిచేస్తున్న బి. వంశీకృష్ణను హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్‌గా నియమించారు. ఇక్కడ ఉపకమిషనర్‌గా పనిచేస్తు సెలక్షన్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన తిప్పర్తి యాదయ్యను శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్ జోన్ల శానిటేషన్-2 జాయింట్ కమిషనర్‌గా నియమించారు. వీరంతా శుక్రవారం తమ తమ సర్కిళ్లలో బాధ్యతలు స్వీకరించారు.

## లింగోజిగూడ అభివృద్ధికి..

ఎల్‌బీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు రూ.22.03 కోట్ల నిధులు మంజూరయ్యాయని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్, స్థానిక కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగోజిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో శారద వైన్స్ నుంచి సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు వరకు రూ.5,098 కోట్లు మంజూరయ్యాయని త్వరలో టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రియదర్శిని పార్కు సమీపంలో వంతెన నిర్మాణం మరమ్మతులకు గాను రూ.5.95కోట్లు మంజూరు చేస్తూ జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు చేపడతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణ్‌కుమార్, శ్రీనాథ్‌రావు, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోటారు వాహన చట్టం ప్రాధాన్యతను తెలుసుకోవాలి

కొత్తపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టం ప్రాధాన్యతను తెలుసుకోవాలని ఎల్బీనగర్ సీపీ క్యాంపు, రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. ఎల్బీనగర్ మజీద్ గల్లీలో గల రియాన్ మిషన్ స్కూల్ నుంచి 49మంది విద్యార్థులు శుక్రవారం రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. పార్కు లెక్చర్ హాల్‌లో టీటీఐ అధికారులు వారికి ట్రాఫిక్ నిబంధనలపై యానిమేషన్ చిత్రాలను, స్లైడ్స్‌ను ప్రదర్శిస్తూ నిబంధనలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ క్రిమినల్ జస్టిస్ సిస్టం, పోలీసింగ్, ప్రాసిక్యూషన్, జుడిషియరీ అంశాలను బోర్డుపై వివరించారు.

### కమిషనరేట్ పరిధిలో 639 మంది విద్యార్థులకు

కమిషనరేట్ పరిధిలో బాలాపూర్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్, రెండు జడ్పీహెచ్‌ఎస్‌లు 6ప్రైవేటు పాఠశాలల్లో రాచకొండ టీటీఐ అధికారులు ట్రాఫిక్ నిబంధనలు, సూచనలు, రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిబంధనలు, సూచనల కరపత్రాలను 639మందికి పంపిణీ చేశారన్నారు.

### మద్యంప్రియులకు డీడీ కౌన్సిలింగ్


మోటారు వాహనచట్టం, పోలీసింగ్‌పై పాఠాలు చెబుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 32 మంది మద్యంప్రియులకు, 73 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద టీటీఐ లెక్చర్ హాల్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య పాల్గొన్నారు.

## కూలీ అదృశ్యం

కొత్తపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి సాగర్ రింగ్‌రోడ్డులో ఉండే బీహార్‌కు చెందిన కూలీ చంద్రభూణ్ ప్రసాద్(45) ఎటో వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో అతడి బావ మనోహర్‌కుమార్ అతడికి ఫోన్‌చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. అతడి ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో మనోహర్‌కుమార్ ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.